# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవుసరం!!

రాజన్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, KAKINADA, A.P. 533 001**

**Editor :**
**J. C. CHOATE**

**Managing Editor :**
**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంచిక 6 జనవరి 1988 సంపుటి 8


# సంపాదకీయము

## మతము : మంచిదా ? చెడ్డదా ?

*( Religion : Good or Bad ? )*

నేటి లోకంలో అనేక గొప్ప మతాలున్నాయి. వాటి వెనుకనున్న శక్తి గొప్పది. మతము పేరున అనేక సత్క్రియలు చేయబడ్డాయి, అలాగే అనేక దుష్క్రియలకు కూడ మతమే కారణం. మతాభిమానులపై ఆ మతం విధించే సంగతులు ఆశ్చర్యం-వారొక రకమైన దుస్తులు ధరించాలని, యాత్రలు జరిపించాలని, వారాలతరబడి ఉపవాస ముండాలని, బ్రహ్మచర్యము నవలంబించాలని, జీవిత కాలమంతయు మిగిలిన వారినుండి వేరుగా యుండాలని, వివిధ బలుల నర్పించాలని, యుద్ధాలు చేయాలని, సాంప్రదాయాలు పాటించాలని, వివిధ సంస్కారములు జరిపించాలని మొదలగునవెన్నో కోరబడతాయి.

'భక్తిపరులు' కొందరు ధనికులౌతారు, మరికొందరు దరిద్రులవుతారు. అనేక రకములైన అద్భుతాలు చేయగలమని చెప్పుకొనే వారుంటారు గాని, దేనిని చేయని వారుంటారు. అయినను ప్రజలు అట్టి

వారినే నమ్ముతారు, జనసమూహములను తమ వైపు త్రిప్పుకొన డానికి రాజకీయ నాయకులు కూడ భక్తిపరులవుతారు. నిజానికి వారి కేవిధమైన ఆసక్తి లేకపోయినను, ఏదో ఒక క్రొత్త మతసంబంధమైన చట్టానికి వారు అనుకూలురనో లేక ప్రతికూలురనో నటిస్తారు; ఊరే గింపులు నడిపిస్తారు.

మతము పేరున యుద్ధాలు చేయబడ్డాయి. ఒక మతసంబంధులు మరొక మతసంబంధులతో పోరాడుదురు. కడకు యిద్దరు నష్టపోవు దురు. వివిధ మతాల్లో స్త్రీలకు సాధారణంగా ఆధిక్యత యుండదు. వారికి బహుశ ఏ విధమైన స్వేచ్ఛ యుండదు, ఉంటే అది బహు స్వల్పము. స్త్రీలు, యావనరాండ్రు యిండ్లలోనే ఉంచబడతారు, వారు పరులకు కనబడకూడదు, ఎక్కడికీ పోకూడదు. ముసుగుతో ముఖం కప్పుకోవాలి అని వారికి చెప్పబడతాది. వారు దేనికొంకు జీవించాలి ? దేనికొరకు నిరీక్షించాలి ? కొన్ని సమాజాల్లో వారి పాత్రయేమీలేదు. వివాహ సందర్భంలో గొప్పకట్నం ఇవ్వడం జరుగుతాది. ఎంత విచారం !

అనేక మతాలు మత స్వేచ్ఛను ఒప్పుకొనవు, యితర మతాల నుండి తమ ప్రజలను వారు కాపాడు కొంటారు. అట్టి భద్రత అవు సరమైన మతం బలహీనమైనది.

జనసంఖ్య విస్తరించుటవలన అనేక మతాలు పెరుగుతాయి. లేదా జనసంఖ్య క్షీణించుటవలన అవి కూడ క్షీణిస్తాయి. ఇట్టి మతా లలో జన్మించిన వారికి తమమతాన్ని గూర్చి యేమీ తెలియక పోవచ్చుగాని వారు ఆ మత సంబంధమైన సంస్కృతిలో పెరుగుతారు.

ఈ లోకంలో యున్న అన్ని మతాలను గూర్చి ఇవన్నియు యథార్థమేగాని, వీటన్నిటికి ఉత్తమమైన మార్గము (మతము) ఒకటి

ఉన్నది: క్రైస్తవ్యము. క్రైస్తవ్యము ఎవని మీద వివిధ సంగతులను మొత్తదు. అది దుష్క్రియలను ప్రోత్సహించదు. హింసలను, యుద్ధాలను అది ప్రోత్సాహించదు. నిజక్రైస్తవ్యమును పాటించువారెవరు అట్టి వాటిని ప్రోత్సహించరు. క్రైస్తవ్యము మానవులకు స్వేచ్ఛను నిరీక్షణను యిస్తుంది. మిగతా మానవులందరిని గౌరవించాలని అది నేర్పుతుంది. పనిచేయువాడు జీతమునకు పాత్రుడని చెప్పి అది కార్మికుని, వాని కృషిని ప్రోత్సహిస్తుంది.

క్రైస్తవ్యము ఇతర మతాలలో యున్న వారిని, వారి జీవిత విధానాన్ని గౌరవిస్తుంది గనుక అది మత స్వేచ్ఛ ననుగ్రహించుచున్నది. క్రీస్తు బోధను ఉపదేశించుట ద్వారా యితరులపై మంచి ప్రభావమును కలిగియుండుట ద్వారా అది ప్రజలను తనలోనికి మార్చుకొంటాది. జన్మ ద్వారా గాక ప్రజలను మార్పు చేయుట ద్వారా అది విస్తరించుచున్నది. లోకంలో ఏదో ఒక మూలలో మాత్రమే తాముండాలని క్రైస్తవులు నమ్మరు. గనుక ప్రజలందరి మధ్య, లోకమంతటా వారు జీవిస్తారు.

క్రీస్తుమతము చెడ్డదికాదు, మంచిది. అది దేవునికి తోటి మానవునికిని జరిగించు సేవా మార్గము. యాకోబు ఇట్లు వ్రాసాడు: "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును, నిష్కళంకము నైన భక్తి యేదనగా-దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తన కంటకుండ తన్నుతాను కాపాడుకొనుటయునే" (యాకో 1:27).

మతము నిన్ను, నీ కుటుంబాన్ని, నీ దేశాన్ని, ఈ లోకాన్ని బాగుచేయని యెడల అది మంచిదెలాగు అవుతాది? క్రీస్తుమతము, క్రైస్తవ్యము ప్రజలను బాగుపరుస్తాది. దాని నంగీకరించి అవలంబించు వారి నందరినీ అది బాగు చేస్తాది.

# క్రీస్తు ఈ విశ్వానికే ప్రభువై యున్నాడు

## *(Christ is the Lord of the Universe)*

(గత సంచిక తరువాయి)

— విక్టర్ డి. తురాక, తెనాలి.

### వాక్యమైన దేవుడు

ఆదియందు వాక్యముండెను. గ్రీకు భాషలో ఉన్న "లోగోస్" అను మాటను, తెలుగులో "వాక్యము" అనుటకంటె "వాక్కు" అనుట ఉచితము. వాక్యము దేవునియొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను...కలిగియున్న దేదియు ఆయన లేకుండ కలుగలేదు - సమస్తము ఆయన మూలముగా కలిగెను-ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను" (యోహాను 1:1, 3, 14). కన్యక గర్భవతియై కుమారుని కనును-ఆయన పేరు 'యిమ్మానుయేలు' అనగా "దేవుడు మనకు తోడని" అర్థము. ఇది యెషయా 7:14 లోని ప్రవచనము నెరవేర్పని - మత్తయి 1 : 22-23 నందు కలదు. "మనకు శిశువు పుట్టెను, కుమారుడు అనుగ్రహింపబడెను - ఆయనకు ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన "దేవుడు" నిత్యుడగు "తండ్రి" సమాధాన కర్తయగు అధిపతి అని అతనికి పేరు" అని, యెషయా 9 : 6, నందలి ప్రవచనము. ఆ శిశువు క్రీస్తేగదా (లూకా 2:1, యోహాను 3:16). మరి ఆయనేగదా "బలవంతుడైన దేవుడని పిలువబడవలసినది. యేసుక్రీస్తు దేవుడని యింకా అర్థము కాలేదా ? ఆయన నిత్యుడగు తండ్రితోకూడా సమానుడని దాని ప్రకటన లేదా ? దేవుడు తన తండ్రి అని చెప్పి, తనను దేవునితో సమానునిగా చేసికొనెనని (యోహాను 5 : 18) యూదులకు తెలిసినదే, వీరికెందుకు తెలియదు ? పాత నిబంధనలో దేవుని గూర్చి తెల్పిన సంగతులును, మెస్సీయ రూపములో ఆయనవచ్చి చేయు పనులను క్రొత్త నిబంధనలో క్రీస్తు వచ్చి నెరవేర్చినట్లు మనము

చూచుచున్నాము-హెబ్రీ భాషలో "మెస్సీయ" అనగా గ్రీకుభాషలో "క్రీస్తు"- అనగా 'అభిషిక్తుడని' అర్థము - దేవునిచేత అభిషేకించబడి పంపబడినవాడు యేసు క్రీస్తే (అ॥ కా॥ 10 : 38, హెబ్రి 1 : 9 అ॥ కా॥ 4:27-28, యోహాను 1:41-42).

పాత నిబంధనలోని 'యెహోవాదూత' తనను యెహోవాగాను, దేవునిగాను చెప్పుకొనెను గాని ఆ 'యెహోవాదూత' యే, దేవత్వములోని రెండవవ్యక్తియైన యేసుక్రీస్తని మనకు తెలియుచున్నది - ఆది 18:1-2లో అబ్రాహామునకు యెహోవా కనబడెనని యున్నది-అతనికి ముగ్గురు మనుష్యులుగా కనబడెను. 3వ వచనములో వారిని 'ప్రభువా' అని మాత్రమే అబ్రాహాము పిలచెను-ఆది 19:1లో ఆ దేవదూతలలో యిద్దరు సొదొమచేరినట్లును ఒక 'దూత' అబ్రాహాముతో నుండెను. "అబ్రాహాము యింకను యెహోవా సన్నిధిని నిలుచుండెనని" ఆది 18 : 22 లో నుండెను. ఆది 16 : 7-13 లో హాగరునకు యెహోవాదూత కనిపించెను దానిని 'దేవుడు' కనిపించినట్లును 'చూచుచున్న దేవుడవు నీవేనని' యెహోవాకు పేరు పెట్టినట్లు ఆది 16 : 13-14 నందు కలదు. అబ్రాహాము ఇస్సాకును బలి యిచ్చుచున్నప్పుడు (ఆది 22 : 10-11, హెబ్రి 11 : 17) యెహోవా దూత పరలోకమునుండి అబ్రాహామును పిలచెను - ఆది 22:2లో ఇస్సాకును యెహోవాకు బలి యివ్వమనెను. 22:12 నీ కుమారుని నాకియ్య వెనుదీయలేదని "యెహోవాదూత" చెప్పెను-నిర్గ 3:2 లో మండుచున్న పొదలో 'యెహోవాదూత' మోషేకు ప్రత్యక్షమాయెను. 6వ వచనములో-'నేను నీ తండ్రి దేవుడను, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడను అనెను-మోషే దేవునివైపు చూడ వెరచెను అని యున్నది - నిర్గమ 23 : 20 లో యెహోవా చెప్పినదేమనగా-నా దూతను నీకు ముందుగా పంపెదను - ఆయనకు కోపము రేపవద్దు-ఆయనమాట వినవలెను-లేని ఎడల ఆయన మీ అతిక్రమ

ములను పరిహరింపడు-నా నామము ఆయనకున్నది. ఆ 'యెహోవా దూత' యే, యేసుక్రీస్తు అనియు, ఆయన నామముననే తాను వచ్చెనని క్రీస్తు చెప్పుకొనెను (యోహాను 5 : 43). మరల తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మయని యోహాను 14 : 26 లోను కలదు. గనుక తండ్రి నామము, కుమారుని నామము పరిశుద్ధాత్మ నామము ఒకటేనని, మత్తయి 28 : 19 నందుకూడా 'నామములు' కాక 'నామము' అని మాత్రమేనని తెలియుచున్నది. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దాస్యము నుండి విడిపించబడి, పాలు తేనెలు ప్రవహించు, వాగ్దాన దేశమునకు రప్పించబడినప్పుడు - వారిని వెంబడించిన ఆత్మ సంబంధమైన బండ క్రీస్తేనని 1 కొరింధి 10:4 లో నున్నది. ఇప్పుడు ఆత్మీయముగా క్రీస్తు బండలోని జీవజలములను మనము త్రాగుచున్నాము. యేసుక్రీస్తు తనను గూర్చి యీ విధముగా చెప్పుకొనెను - "అరణ్యములో మోషే సర్పమును ఏలాగు ఎత్తెనో, ఆలాగే విశ్వసించు ప్రతివాడును నశింపక ఆయన ద్వారా నిత్య జీవము పొందునట్లు మనుష్య కుమారుడును (సిలువపై) ఎత్తబడ వలెను (యోహాను 3 : 14-15). "నేను నేనే యెహోవాను, నేను తప్ప వేరొక రక్షకుడు లేడు. ప్రకటించు వాడను నేనే రక్షించు వాడను నేనే" అని, యెహోవా యెషయాద్వారా పలికెను (యెషయ 43 : 11). కాని మన రక్షకుడు యేసుక్రీస్తని క్రొత్త నిబంధన తెలుపుచున్నది (మత్తయి 1:21, లూకా 1:47, యోహాను 4:42, అ.కా. 5:31).

## క్రీస్తు లోకాధికారిని జయించాడు

దేవుడు ఆదామును హవ్వను ఆశీర్వదించి సమస్తమును ఏలుటకు వారికి అధికారమిచ్చెను (ఆది 1:28) గాని వారు దేవుని ఆజ్ఞ మీరినందున ఈ లోకమంతయు సైతానుకు తాకట్టుగా వెళ్ళిపోయెను. అందుకే సాతాను క్రీస్తుతో - "ఈ అధికారమంతయు ఈ రాజ్యములు

మహిమయు నీ కిత్తును, అది నాకప్పగించబడి యున్నది. అది ఎవనికి నేను యియ్య గోరుదునో వాని కిత్తును ననెను" (లూకా 4:5-7). "బలవంతుడు ఆయుధములు ధరించుకొని తన ఆవరణమును కాచుకొను నప్పుడు అతని సొత్తు భద్రముగా నుండును - అయితే అతనికంటె బలవంతుడైన యొకడు అతని పైబడి జయించునప్పుడు, అతడు నమ్ము కొనిన ఆయుధము లన్నిటిని లాగుకొని అతని ఆస్తిని పంచిపెట్టునని యేసు చెప్పెను (లూకా 11:21-22). ఇచట బలవంతుడు - సాతాను (హెబ్రీ 2.14). ఆయుధములు (1 యోహాను 2:16). తన ఆవరణము లోకము, అతని సొత్తు - పాపులు. అతనికంటె బలవంతుడు - క్రీస్తు (1 యోహాను 4:4). అతని పైబడి జయించునప్పుడు (1 యోహాను 2:1, 3; 8) - ఈ సంగతినే మత్తయి 12:29 లో కూడ చూడగలము. "ఆయన ప్రధానులను, అధికారులను, నిరాయుధులుగా చేసి, సిలువ చేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహాటముగా వేడుకకు కనబరచెను (కొలస్స 2:15). ఇది, యెషయా 49:24-25, లోని వాగ్దానము యొక్క నెరవేర్పు. అచట 'నేనే' రక్షించెదనని యెహోవా తెలిపెను, ఇచట యేసుక్రీస్తు ఈ పనిని నెరవేర్చెను. అందుచేత ఆయన ఆరోహణమైనప్పుడు చెరను చెరగా పట్టుకొని పోయి మనుష్యులకు ఈవులను అనుగ్రహించెనని చెప్పబడినది (ఎఫెసి 4:8). "ఈ మాటలు చెప్పి వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను, అప్పుడు వారి కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను (అ॥ కా॥ 1:9). ఈ దృశ్యదర్శనమును సుమారు 500 సం॥లకు ముందే, దానియేలు ప్రవక్త చూచి తన గ్రంథమందు లిఖించెను. "రాత్రికలిగిన దర్శనములను నేనింక చూచుచుండగా, ఆకాశ మేఘారూఢుడై మనుష్య కుమారుని పోలిన యొకడు (యేసుక్రీస్తు) వచ్చి ఆ మహావృద్ధుడగు వాని సన్నిధిని ప్రవేశించి ఆయన సముఖమునకు తేబడెను. సకల జనులును, రాష్ట్రములును ఆయా భాషలు మాటలాడువారును ఆయ

నను సేవించునట్లు ప్రభుత్వమును, మహిమయు అధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది (అది 1000 సం॥లు మాత్రమే వుండునది కాదు). అది ఎన్నటికిని తొలగిపోదు, ఆయన రాజ్యము ఎపుడును లయముకాదు" (దాని 7 : 13-14). యేసు వారి యొద్దకు వచ్చి పరలోకములోను భూమిమీదను నాకు సర్వాధి కారము యియ్యబడియున్నదని చెప్పెను (మత్తయి 28 : 18). "మరి ఎవని వలనను రక్షణకలుగదు ఈ నామముననే (యేసుక్రీస్తు) మనము రక్షణపొందవలెను, గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము (అ॥ కా॥ 4:12). "అందుచేతను పరలోకమందున్న వారిలోగాని, భూమి మీద ఉన్న వారిలోగాని, భూమి క్రింద వున్న వారిలోగాని ప్రతివాని మోకాలును యేసు నామమున వంగునట్లు (ఇది యెహోవా దేవునికి మాత్రమే చెందవలసినది- యేసుక్రీస్తులో నెరవేరినది - యెషయ 45 : 23) దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతినామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను (ఫిలిప్పి 2 : 9-11).

"ఆయన ఆ బలాతిశయముచేత క్రీస్తును మృతులలోనుండి లేపి, సమస్తమైన ఆధిపత్యము కంటెను, అధికారము కంటెను, ప్రభుత్వము కంటెను, శక్తికంటెను, ఈ యుగమందు మాత్రమే గాక రాబోవుయుగము నందును పేరు పొందిన ప్రతినామము కంటెను, ఎంతో హెచ్చుగా పరలోకమందు ఆయన తన కుడి పార్శ్వమున కూర్చుండబెట్టుకొని యున్నాడు. మరియు సమస్తమును ఆయన పాదములక్రింద ఉంచి, సమస్తముపైన ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను ఆ సంఘము, ఆయన శరీరమైన "క్రీస్తు సంఘము". (ఎఫెసి 1 : 20-23). శ్రీమంతుడును, అద్వితీయుడు నగు సర్వాధిపతి యగు యేసుక్రీస్తు ఈ విశ్వానికే ప్రభువై రాజులకు రాజును ప్రభువులకు ప్రభువై, సమీపింపరాని తేజస్సులో వసించుచున్నాడు. (1 తిమోతి 6 : 16).

— ఆమెన్ —

# సార్వభౌముడైన క్రీస్తు

1. క్రీస్తును మనజీవితములో సార్వభౌమునిగా అంగీకరించుట మనవిధి మరియు మనభాగ్యము; క్రీస్తు ప్రభు సార్వభౌముడు సర్వాధికారి అని చూపించు కొన్ని ప్రవచన వాక్యములు చూచెదము: "సకల జనులును రాష్ట్రములును ఆయా భాషలు మాట్లాడు వారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. అదెన్నటికిని తొలగిపోదు. ఆయన రాజ్యము ఎప్పుడును లయముకాదు" (దానియేలు 7 : 13, 14).

2. గుమ్మములారా, మీ తలలు పైకెత్తుకొనుడి. మహిమగల రాజు ప్రవేశించునట్లు ... లేవనెత్తికొనుడి. కీర్త 24 : 7 పునరుద్ధానుడైన క్రీస్తు ప్రభువు పరలోక ప్రవేశము చేయునపుడు దూతకోటి ఆయన కిచ్చు ఆహ్వానమును తెలియజేయు ప్రవచనమిది.

3. పెంతెకొస్తు దినమున పేతురు మాటలు - "మీరు సిలువ వేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెను. అ॥ కార్య 2 : 36. రూఢిగా తెలిసికొనవలసిన దేమి ? వారు సామాన్యుడుగా తలచిన యేసు వారు నిరాకరించిన యేసును వారు ప్రభువుగా గుర్తింపవలయును. వేరు గత్యంతరము లేదు అని పేతురు ఉద్ఘాటించెను.

4. అపొ. పౌలు హెబ్రీ పత్రికలో వ్రాయునదేమి ? "దేవదూతలకంటె కొంచెము తక్కువ వాడుగా చేయబడిన యేసు మరణము పొందినందున మహిమా ప్రభావములతో కిరీటము ధరించిన వానిగా చూచుచున్నాము" 2 : 9.

5. పౌలు మరొక చోట చెప్పునది — "ఆయన ఆ బలాతిశయముచే క్రీస్తును మృతులలోనుండి లేపి సమస్తమైన ఆధిపత్యము

కంటెను అధికారము కంటెను శక్తి కంటెను ప్రభుత్వము కంటెను... ఎంతో హెచ్చుగా పరలోకమందు ఆయనను ... కూర్చుండ బెట్టుకొని యున్నాడు. ఎఫె 1:20, 21. ఈ మాటలలో మనము గమనించునదేది? క్రీస్తు ప్రభు అధిష్ఠించిన స్థానమునకు మించి ఉన్నతమైన మరొక స్థానములేదు, మరియు ఈ మాటలు గమనించుము— సమస్తముపైన—ఎంతో హెచ్చుగా—ప్రతి నామము కంటెను."—

6. ఫిలిప్పీ 2:9-11 చూచెదము - అందుచేతను (అనగా మరణము పొందినందుచేత) పరలోకమందున్న వారిలోగాని, భూమి మీద ఉన్నవారిలోగాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతీవాని మోకాలు ... ప్రతివాని నాలుక ... అధికముగా హెచ్చించి; ప్రతి నామమునకు పైనామము ... ప్రతివాని .. అధికముగా హెచ్చించి ... అనుమాటలు గమనించుము.

7. రోమా 9 : 5 చూడుము - "ఈయన సర్వాధికారియైన దేవుడై యుండి నిరంతరము స్తోత్రార్హుండై యున్నాడు".

8. యేసు తానే చెప్పిన మాటను గమనించుము - "పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికార మియ్యబడియున్నది" మత్త 28:19, 20. సర్వాధికారము అనుమాట గమనించుము.

9. ప్రకటన గ్రంథములో చాల చోట్లలో ప్రభువు రాజులకు రాజును ప్రభువులకు ప్రభువని చెప్పబడినది (ప్రక 5 : 9-14; 17:14; 19:16). నిరాకరింపబడి, శిలువ వేయబడి, చనిపోయిన యేసు పునరుత్థానము నొందినందున- ఉన్నతలోకములో సర్వాధికారము నొందిన వాడాయెను. ఆ మహోన్నత స్థానమునకు తాను అర్హుడనని పునరుత్థానము ద్వార నిరూపించుకొన్నాడు.

## క్రీస్తు సంపూర్ణుడు

ఈ దినములలో చాల మంది పండితులైన క్రైస్తవేతరులు ఆయనను చాల పొగడు చున్నామని తలంచి, - "యేసు చాల గొప్ప

వాడు గొప్ప నీతులు బోధించినాడు, అనేక సత్యములు బయలు పెట్టినాడు అని అందురు. క్రీస్తు ప్రభువును మానవులతో పోల్చి వారి కంటెను, వీరి కంటెను అగ్రగణ్యుడు అనుట కూడ నేరమేయగును. ఆయన సత్యవాక్కులు మాత్రము బోధించినవాడు కాదు; ఆయనే సత్యము; ఆయన మంచిమార్గము చూపినవాడు మాత్రమే కాడు, ఆయనే మార్గము; ఆయన చాల మంచివాడు అనుట చాలదు. ఆయనే పరిశుద్ధుడు, ఆదర్శ పురుషుడు అను అంశముపై సర్ ఎస్. రాధాకృష్ణ (President of the Indian Union) ఒకసారి మాట్లాడుచు - క్రీస్తు నేటి దినములలో జీవించుచున్న లైన ఆయనే మాదిరి పురుషుడు అని చెప్పగలము అని తన ఉపన్యాసములలో పలికెను. క్రీస్తులో సంపూర్ణత గలదు, అంతేకాదు సర్వ సంపూర్ణతగలదు. నీతిలో సంపూర్ణుడు ప్రేమలో సంపూర్ణుడు, త్యాగములో సంపూర్ణుడు అందుకు ఆయన సర్వసంపూర్ణత గలవాడని చెప్పబడినది. (కొల 2:9).

ఒకడు క్రీస్తు యొద్దకు రాకముందు తన యిష్ట మొచ్చిన వైపుకు పోవుటకు స్వతంత్రత గలదు. కుడికా, ఎడమకా? రక్షణవైపా నాశనము తట్టా? గాని ప్రభువును అంగీకరించిన పిదప అతడు సంపూర్ణముగ అన్ని విషయములలో ప్రభువుకు లోబడవలయును. ఏలయన ఆయన సర్వములో సర్వమైయున్నాడు "If Jesus is not my all in all, He is nothing at all" అని ఒక భక్తుడు పలికినాడు.

## సంఘూవికి ఆయనే ప్రభువు

అన్ని విషయములలో ఆయన మాట వినవలయును అని ఆయనను గూర్చి ప్రవక్తలు ప్రవచించిరి. (అ॥ కా॥ 3:22). క్రీస్తు ప్రభువుకును సంఘమునకును గల సంబంధ మేమి? అన్నిటిలోను సంబంధమే. సంఘము నూటికి నూరుపాళ్లు ఆయనది. దాని ఉనికికి ఆయనే కారణము (మత్త 16:18. అకా 20 : 28). దాని కొనసాగింపుకు, అది సంపూర్ణ మహిమలో ప్రవేశించుటకు ఆయనే ఆధారభూతుడు.

సంఘము ఎప్పు డేర్పడినది అని అడిగినప్పుడు - పెంతెకోస్తుదిన మున ఏర్పడినదని బైబిలు చరిత్ర చెప్పుచున్నది. కాని నిజముగా చూస్తే అనాదికాలమందే, అనగా ఈ లోకము పుట్టకమునుపే అని ఉన్నది. ఎక్కడున్నది? దేవుని సంకల్పములో ఉన్నది. (ఎఫె 3:3-11). సంఘమునకు గల ఔన్నత్య స్థానము దీనివలన మనము గ్రహించు చున్నాము. సంఘ ఔన్నత్యమును గూర్చిన మరొక ప్రవచనము, మరీ ఆశ్చర్యమును గొలుపును. యెషయా 2 : 2లో యెహోవా మందిర పర్వతము కొండలన్నిటి కంటె ఎత్తుగా ఎత్తబడును అని చెప్పినాడు. దాని భావమేమి? అంతకన్న ఉన్నతస్థానము గలది మరొ కటి లేదు. ఇంత ఔన్నత్యస్థానము, ఏకైక స్థానము సంఘమునకున్న దీని క్రైస్తవ ప్రపంచము గ్రహించినచో ఎంత ఆనంద కరముగ నుండును. కాని చాల అల్పభావములు సంఘమును గూర్చి ప్రపంచము నావరించినవి. మా సంఘమునకు అధికారి బిషప్పు అని ఒకడు, మా సంఘాధికారి ప్రెశిడెంటు అని మరొకరు చెప్పుచున్నారు. నాకే సంఘము అక్కర లేదు అని కొందరు, నాకన్ని సంఘములు ఒక్కటే అని కొందరు ఏల చెప్పవలసి వచ్చినది ? క్రీస్తు ప్రభు. సంఘమునకు శిరస్సు అనియు, ఆయన పేరుతో సంఘము అనాది కాలములో పిలువబడినదనియు (రోమా 16 : 16) బైబిలు తేట తెల్లముగ జెప్పుచుండ బాప్టిస్టు, లూథరన్ పెంతెకోస్తు అను వేల కొలది పేర్లతో సంఘమును పిలుచుటేల? క్రీస్తు ప్రభువు, సర్వాధి కారి అయినచో, సార్వభౌముడైనచో అన్ని విషయములలో ఆయన కేల లోబడియుండకూడదు ? (కీర్త 8 : 22 మరొక సారి చూడండి.)

మానవ కల్పిత నామములలో గల లోపములు మతశాఖల పెద్దలు గ్రహించకపోలేదు. చార్లెస్ స్పర్జన్ అను బాప్టిస్టు సంఘ నాయకుడు చెప్పినదేమి ? "బాప్టిస్టు అను పేరుగల ప్రతివాడు చావవలెననియు క్రైస్తవుడను పేరు గలవాడు మాత్రము

జీవించవలెననియు నేను కోరుచున్నాను." ఈ మాటలను బట్టి మత శాఖల కల్పిత సిద్ధాంతములు కేవలము తప్పు అని ఆయన ఆవేదన మనకు స్పష్టమగుచున్నది.

సంఘమును గూర్చి మరియొక తేలిక మాట మతప్రించములో చూచుచున్నాము—"యేసుప్రభు అసలు రాజ్యస్థాపనకే ఈలోకము నకు వచ్చినాడు. గాని యూదులు ఎదురాడినందున సంఘమును నిర్మించినాడు. ఇది తాత్కాలికమే. మరల రెండవరాకడలో ఆయన రాజ్యమును స్థాపించును. అప్పుడు సంఘము అదృశ్యమగును". ఇదె క్కడి మాట ? ఈ వికృత బోధకు ఆధారమేమి ? ఇక్కడ రెండు విషయము లాలోచించవలయును.

1. యూదులెదురాడి నందున రాజ్యమును కట్టలేకపోయి నాడు? అనగా తాను వచ్చిన పని నెరవేర్చ లేకపోయినాడన్న మాట- అది అబద్ధము. కేవలము అబద్ధము. యోహా 17 : 4లో చెప్పబడిన మాటేమి? "చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెర వేర్చితిని" అని తండ్రితో ప్రార్థనలో మన ప్రభువు చెప్పుచున్నాడు. ఇది తేటగా లేదా? ఆయన చేయలేకపోయినది ఏమున్నది? సంఘము స్థాపించుట తండ్రి చిత్తమే.

2. రాజ్యము-సంఘము ఒక్కటేగదా, క్రైస్తవుడు ఆయన సంఘములో (శరీరములో) నున్నాడు అనగా ఆయన రాజ్యము లోను ఉన్నాడు (కొలస్స 1 : 13, 18). రెండును ఒక్కటే (అ. పొ. 20:28 ప్రక 5:9-10. క్రీస్తు సంఘములోనికి ప్రవేశమెట్లు? క్రీస్తుప్రభువు యొక్క సార్వభౌమత్వమును మనము గుర్తించినచో ఆయన సంఘ ములోనికి ఆయన పెట్టిన షరతులను అక్షరాల పాటించవలయును. వాటికి కలుపుటగాని, వాటినుండి తీసివేయుటగాని, వాటికి మెరుగు పెట్టుటగాని మనకు తగదు. యేసుక్రీస్తు సార్వభౌముడైనచో, సంఘము మహిమాన్వితమైనదైనచో అందు ప్రవేశించుటకు ప్రభువు

పెట్టిన షరతులతో మనము చెలగాటము లాడకూడదు. "విశ్వాస ముంచేచాలు, బాప్తిస్మ మక్కడలేదు అని ఒకరు, ఏరీతిని బాప్తిస్మము పొందినా పరవలేదు అని మరొకరు ఏల చెప్పవలసి వచ్చెను? ఒక గొప్ప ఆంగ్లికన్ వేదాంతి ఈ రీతిగ చెప్పుచున్నాడు: "ముంచడము ద్వారా బాప్తిస్మము ఆ దినములలో సరిపోయింది. ఈ దినముల కాలాగు అక్కరలేదు"- ఇదెక్కడి మాట? ఒక్కొక్క కాలమునకు ఒక్కొక్క రీతిని బాప్తిస్మము లియ్యవలెనా? అలాగున క్రీస్తు చెప్పినాడా? ఈ వ్యర్థ పారంపర్యాచారమునుండి క్రైస్తవ లోకము దూరము కావలెనని కోరుదము. మన ఆరాధనలు సామాన్యమైనవిగను ఆడంబరములు లేనివిగను ఉండవలెనని వాక్యము చూపించుచుండ వ్యర్థమైనవియు, వివిధములైనవియునైన ఆచార కాండతో మునిగిపోయినవి.

## గృహానికి క్రీస్తే ప్రభువు

గృహములలో క్రీస్తుకుగల స్థానము చూచెదము-కుటుంబ జీవితములో క్రీస్తుకు సంపూర్ణ అధికారము లేని గృహములు క్రైస్తవ గృహములు కావు. తలిదండ్రులు మాత్రము కాక, పూర్తి నెరిగిన, బిడ్డలు కూడ రక్షణ పొందినవారై యుండవలమును. "ప్రభువైన యేసు నందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీయింటివారును రక్షణ పొందుదురు" అని పౌలు చెప్పిన మాటలు (అ.కా. 16 : 31). ఈ దినములలో మన క్రైస్తవ గృహములు పాటించనలయును "నీయింటివారు" అని చెప్పునపుడు బిడ్డలుకూడ రక్షణపొందవలెనను భావ మక్కడనున్నది. అనేక గృహములలో అది చాలలోటుగా నున్నది. మతవిద్య బిడ్డలకు చిన్ననాటినుండియే తలిదండ్రులచే నేర్పబడవలయును. ఆ పనిని చాలమంది తలిదండ్రులు సంఘమునకు వదలి వేయుచున్నారు. అది సరికాదు. బిడ్డలకు చిన్న నాటినుండియే దేవుని గూర్చిన విధులు నేర్పబడవలెనను నియమము ఇశ్రాయేలు జనాంగమునకు గలదు. దేవుడు మోషే ద్వార ఇశ్రాయేలు జనాంగమునకు

ఆజ్ఞాపించినదేమి? నీ బిడ్డలకు, యింటను బైటను పండుకొనునప్పుడు త్రోవ నడుచునప్పుడు ఆయన కట్టడలను నేర్పించుమని ఆజ్ఞ యిచ్చెను (ద్వితి 11 : 18-20). ప్రపంచ జనాంగములలో మత విద్య బాల్యము నుండి బిడ్డలకు బోధించునది యూద జనాంగిమొక్కటే. తిమొతికి మతవిద్య నేర్పిన వారెవరు? (2 తిమొ 1:5, 3 : 15). అతని తల్లియు, అవ్వయునై యుండవలయును. తల్లి యూదురాలై యుండియు, గ్రీకు వానిని పెండ్లి యాడుట సంభవించినది. ఆలాంటివి వలదు. యూద మతమునకు దూరమగుట సాధ్యము మరియు యూదులు లేని అన్య జనాంగముల మధ్య జీవించుచున్నది. లుస్త్ర అన్యజనులు, విగ్రహారాధికులతో నిండిన పట్నము (అ. కా. 14:6). ఆలాంటి పరిస్థితులలో ఆమె యింకను మత భ్రష్టత్వము నొంది యుండవలయును, గాని అట్లు జరుగలేదు. ఆమెలోను, ఆమె తల్లిలోను విశ్వాసము జీవించియే యున్నది. అందుచే తమ బిడ్డకు ఉగ్గుపాలతో యెహోవా దేవుని గూర్చి నేర్పినారు. ఈ దినములలో ఆలాటి తల్లులు మన క్రైస్తవ కుటుంబములలో ఉండవలెను. ప్రతి క్రైస్తవ కుటుంబమును, చిన్న పరలోకముగ తయారు చేసికోవలసిన పూచీ తల్లిదండ్రులకు గలదు. కుటుంబము అననేమి? దాని నిర్వచన మేది అని అడిగినప్పుడు, ఒకరీలాగు చెప్పిరి. ప్రేమ, పరిశుద్ధత, క్షమాపణ, త్యాగము ఏ యింట ఉన్నదో అదే క్రైస్తవ గృహము. క్రీస్తు సర్వాధిపతియని, సార్వభౌముడని స్థానిక సంఘములును, క్రైస్తవ గృహములును గ్రహించిననాడు మనకు గొప్ప ఆశీర్వాదములు కలుగును. ★

— T. జ్ఞానానందము, కాకినాడ.

## ఇతర సువార్తలను ప్రకటించుట

## (*Preaching other Gospels*)

నూతన నిబంధనలో యేసుక్రీస్తు యొక్క ఏకైక సువార్త యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పబడినను, దానియందు ఇతర

సువార్తల ప్రస్తావనకూడ గలదు. పౌలు ఇట్లు హెచ్చరించెను: "ఏలయనగా వచ్చినవాడెవడైనను మేము ప్రకటింపని మరియొక యేసును ప్రకటించినను, లేక మీరు పొందని మరియొక ఆత్మను మీరు పొందినను, మీరు అంగీకరింపని మరియొక సువార్త మీరు అంగీకరించినను. మీరు వానిని గూర్చి సహించుట యుక్తమే" (2 కొరింధి 11:4). అతడు ఇంకను ఇట్లు హెచ్చరించెను: "ఏలయనగా అట్టివారు క్రీస్తు యొక్క అపొస్తలుల వేషము ధరించుకొనువారై యుండి, దొంగ అపొస్తలులును, మోసగాండ్రగు పనివారునై యున్నారు. ఇది ఆశ్చర్యము కాదు; సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొనుచున్నాడు. గనుక వాని పరిచారకులును నీతి పరిచారకుల వేషము ధరించుకొనుట గొప్ప సంగతి కాదు. వారి క్రియల చొప్పున వారి కంతము కలుగును" (2 కొరింధి 11:13-15).

పౌలు గలతీయుల కిట్లు వ్రాసెను: "క్రీస్తు కృపనుబట్టి మిమ్మును పిలిచినవానిని విడిచి, భిన్నమైన సువార్త తట్టుకు మీరింత త్వరగా తిరిగిపోవుట చూడగా నా కాశ్చర్యమగుచున్నది. అది మరియొక సువార్త కాదుగాని, క్రీస్తు సువార్తను చెరుపగోరి మిమ్మును కలవర పరచువారు కొందరున్నారు. మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమేయైనను, పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించినయెడల అతడు శాపగ్రస్తుడవునుగాక. మేమిదివరకు చెప్పినప్రకారము ఇప్పుడును మరల చెప్పుచున్నాము; మీరు అంగీకరించిన సువార్తగాక మరియొకటి యెవడైనను మీకు ప్రకటించినయెడల వాడు శాపగ్రస్తుడవునుగాక" (గలతీ 1 : 6-9). ఇచట అపొస్తలుడేమి చెప్పుచున్నాడు? ఈ దిగువ సంగతులను గుర్తించుము.

1. గలతీయులు యేసుక్రీస్తు యొక్క స్వచ్ఛమైన సువార్తను పొందియున్నారు.

2. వారు భిన్నమైన సువార్తకు త్వరగా తిరిగి పోవుటను చూచి పౌలు ఆశ్చర్యమును వెలిబుచ్చెను. కాని వెనువెంటనే అతడు అది స్వచ్ఛమైన సువార్తకు భిన్నమైనదని వారికి ఉపదేశించెను.

3. వారిలో కొందరు సువార్తను తప్పుడు మార్గమున పెట్టి, క్రీస్తు సువార్తను మార్చి సువార్తను వ్యర్థపర్చువారు గలరు.

4. తాను గాని, ఇతరులు ఎవరైనగాని లేక పరలోకము నుండి వచ్చిన దేవదూతగాని అప్పటికి ప్రకటించబడియున్న సువార్త కాక వేరొక సువార్తను ప్రకటించిన యెడల వారు శాపగ్రస్తులని పౌలు చెప్పెను. అనగా స్వచ్ఛమైన సువార్త ఇదివరకే ప్రకటించబడెను. దానికి విరుద్ధముగా ప్రకటించబడు ఏ సువార్తయైనను స్వచ్ఛమైనది కాదు, ఇదిగాక, ఈ లోక సంబంధిగాని, పరలోక సంబంధిగాని అది ఎవడైనను క్రొత్త విషయమేదైన ప్రకటించి ప్రభువు దీవెన లుండునని తలంచలేదు. కాని అతడు దాని పర్యవసానమును గూర్చి శ్రమనొందవలసి యుండును.

5. ఈ హెచ్చరికను నొక్కి చెప్పుటకు పౌలు మరల చెప్పుచున్నాడు.

ముందు పేర్కొనిన వానిని చూచునపుడు, ప్రభువు రక్షణ ప్రణాళికలో మరియొక సువార్తకు స్థానము లేదు, అనేక సువార్తల మాట అసలు తలపెట్టనేలేదు. దేవుని వాక్యములో మనము చదువు సువార్తకు విరుద్ధముగా మరియొక సువార్తను ప్రకటించుట చాలా ప్రమాదము. ఏలయనగా దేవుని యొక్క శాపము వారిపై బడును. ఎందుచేత? ఏలయనగా ప్రభువు మరియొక సువార్తను ప్రకటించుటకు మానవునికి ఎట్టి హక్కును, అధికారమును ఈయలేదు. వేరొక విషయమును బోధించుట యనగా క్రీస్తు సువార్తను పరిత్యజించుటయే.

ఇవి యన్ని యున్నను, ఈ దినములలో అనేక సువార్తలు ప్రకటింపబడుట మనకు తెలియును. అనగా అనేక గక్షణ

ప్రణాళికలు, విరుద్ధ సిద్ధాంతములు బోధించబడుచున్నవి. ఏది స్వచ్ఛమైన సువార్త? మనకు సరియైన సువార్త యున్నదని మన కెట్లు తెలియును? ఈ దిగువ అభిప్రాయములను గూర్చి యోచించుము:

1. సువార్త సంబంధమైన సత్యముకొరకు బైబిలు నొద్దకు తిరుగుము. క్రీస్తు మంచి సువార్తను గూర్చిన సత్యమునకు దేవుని గ్రంథమే మూలము. దాని పుటలలో నీవు సువార్తను గూర్చిన సత్యములు (1 కొరింథీ 15 : 1-4), సువార్త యొక్క ఆజ్ఞలు (మార్కు 16:15, 16; అ. కా. 2:38) చదువ గలవు. నీ సందేహములు, తప్పుడు అర్థములు, ప్రశ్నలు ఇవన్నియు, ఆయన వాక్యముద్వారా దేవుని మాట్లాడ నిచ్చిన, తీరిపోవును.

2. లేఖనములలో బోధించబడిన రక్షణ మార్గమునకు విభేదముగాయున్న రక్షణ మార్గమును గూర్చిన ఏబోధనైనను త్రోసిపుచ్చుము. మానవునికి ఈ విషయములో తన ఉద్దేశములు, తలంపులు వెలిబుచ్చుటకు ఎట్టి అధికారమును ఈయబడలేదు; సరియైన విధము ఆలోచించు ఏ వ్యక్తియైనను వీటినంగీకరించడు.

3. మతశాఖలవారితో ప్రకటించబడుచున్న సువార్తలు బైబిలుకు చెందిన స్వచ్ఛమైన సువార్త కాదు. క్రీస్తు సువార్తకు విధేయుడవైన నీవు మతశాఖలలో యుండవు, మానవ నిర్మితమైన నామమును ధరించవు. దీనిని జ్ఞాపకముంచుకొనుము. క్రీస్తు సువార్తకు విధేయుడవగుటవలన కల్గు ఫలితము నీకు రక్షణ, ప్రభువు సంఘములో చేర్చబడుట, ఆ విధముగా నీవు క్రైస్తవుడుగా మాత్రమే యగుట. అ. కా. 2:38, 47; అ.కా. 11:26 చదువుము.

4. "విశ్వాసము మాత్రమే" యని బోధించు వారియెడల జాగ్రత్తకలిగి యుండుము. వారు బాప్తిస్మము లేకుండ రక్షించబడగలవు అని బోధించుదురు. ఇది మనము బైబిలులో చదువునది కాక ఇతర సువార్తలను ప్రకటించువారికి ప్రీతియైన మత సిద్ధాంతము.

ఈ హెచ్చరిక ఎందుకు ఈయబడినదనగా ఒకడు రక్షించబడవలెననిన అతడు నమ్ముటమాత్రమే గాక బాప్తిస్మముకూడ పొందవలెనని బైబిలు బోధించుచున్నది (మార్కు 16:16).

5. నాశనమునకు దారితీయు విశాలమార్గమునందున్న వారు అనేకులని జ్ఞాపకముంచుకొనుము (మత్తయి 7 : 13, 14). కొన్నిసార్లు ఇతర సువార్తలను ప్రకటించువారు వారి తప్పుడు బోధలకు లోనైన వారికి అనేకులు ఈ విషయములే నమ్ముచున్నారని విజ్ఞప్తి చేయుదురు. కాని అనేకులు ఎప్పుడూ తప్పు మార్గములో నున్నారని జ్ఞాపకముంచుకొనుము.

6. ఈ కాలములో ప్రచురించబడుచున్న ఆధునిక సువార్తలు చీలికలకు ప్రాతినిధ్యముగా యున్నవి. ఇవి చీలికలను పెంపొందించును. వారు చీలికలను బాహాటముగా బోధించుదురు. ఇట్లుగాక యేసుక్రీస్తు సువార్త ఐక్యతను, ఏకత్వమును, శాంతిని పెంపొందించును. 1 కొరింథీ 1 మరియు 1 కొరింథీ 12 చదువుము. అప్పుడు యోహాను 17వ అధ్యాయము చదివి దానిలో ప్రభువు అపొస్తలులందరు ఒకటిగా యుండి, వారి బోధలను నమ్ము వారందరుకూడ ఒకటిగా యుండవలెనని ఎట్లు ప్రార్థించెనో చూడుము.

7. ఆఖరుగా ఈ యితర సువార్తలు రక్షింపవని జ్ఞాపకముంచుకొనుము. అవి వాటిని బోధించువారిని, వాటిని అంగీకరించువారిని నశింపచేయును. క్రీస్తుయొక్క స్వచ్ఛమైన సువార్తకే రక్షించుశక్తి కలదు (రోమా 1:16, 17).

అసత్యమును బోధించి, ప్రకటించుట ద్వారా చీలిక లేర్పడుచున్నవి. కావున పౌలు ఇట్లు హెచ్చరించెను. "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను, ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టి యుండుడని మిమ్మును, బ్రతిమాలు కొను చున్నాను. వారిలో నుండి తొలగిపోవుడి. అట్టివారు మన ప్రభు

వైన క్రీస్తుకు కాక తమ కడుపునకే దాసులు; వారు ఇంపైన మాటల వలనను, ఇచ్చకముల వలనను నిష్కపటుల మనస్సులను మోసపుచ్చుదురు" (రోమా 16:17, 18). దీని ప్రకారముగా మనము అట్టి బోధకులను గుర్తించవలెను. అట్టివారిని దూరము చేసికొనవలెను. యోహాను ఇట్లు వ్రాసెను: "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందునకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని, కుమారుని అంగీకరించువాడు. ఎవడైనను ఈ బోధను తేక మీ యొద్దకు వచ్చినయెడల వానిని మీ యింట చేర్చుకొనవద్దు; శుభమని వానితో చెప్పనువద్దు. శుభమని వానితో చెప్పువాడు వాని దుష్టక్రియలలో పాలివాడగును" (2 యోహాను: 9-11). క్రీస్తుకూడ ఇట్లు హెచ్చరించెను: "ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా - ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపినయెడల, ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్లు దేవుడు వానికి కలుగజేయును; ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసినయెడల, దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవ వృక్షములోను, పరిశుద్ధ పట్టణములోను వానికి పాలులేకుండ చేయును" (ప్రకటన 22 : 18-19).

ఇతర సువార్తలను బోధించువారిలో అనేకులు వారు బోధించునది నిష్కపటముగా బోధింతురు. వారు మోసపుచ్చబడిరి. అయితే వారు చేయునది అబద్ధబోధ. దానినుండి వారు తప్పించుకొనలేరు, కావున ఈ విషయములో వారు దేవునికి సమాధానము చెప్పవలసినవారై యున్నారు. మిగత కొందరు నిజాయితీ లేనివారు. జీతగాళ్ల విషయములో ఇది సత్యము. అట్టివారు ఆత్మల రక్షణయందు ఇచ్ఛ లేనివారు. వారు తమ భత్యముకొరకే పనిచేయువారు. జీతమందున్నంతవరకు వారు ఏమి బోధించుచున్నారో వారికి ఖాతరులేదు. ఇట్టి విషయములలో మీరు మోసపోకుడి.

మతశాఖలవారు ఈ దినములలో ఐక్యతను గూర్చి చాలా మాట్లాడుచున్నారు. ఇట్లున్నను, మరి యెక్కువగా వారు చీలికలను చేయుచున్నారు. వారు నిజముగా ఐక్యత కోరిన యెడల ఒకే సువార్త కొరకు వారందరు బైబిలునకు తిరిగి, దానినే బోధించవలెను. అప్పుడు దాని ఫలితముగా ఐక్యత ఏర్పడును. ఇది చాలా సూక్ష్మము.

— జె. సి. ఛోటా

## ఇది మీరు తెలుసుకొనుట మంచిది
## (It is Good for you to know This)

దేవుడు సత్యవంతుడు (యోహాను 3 : 33, 34). ఆయన వాక్యము అనగా బైబిలు గ్రంథము సత్యమైనది (యోహాను 17:17). బైబిలు గ్రహించుట కష్టమైన విషయం కాదు. దేవుని నిత్య సంకల్పములు ఎరుగుట కష్టమైన విషయం కాదు (2 పేతురు 3 : 16). కాని, విచారమయిన విషయం ఏమంటే, యేసుక్రీస్తు కంటే, పరిశుద్ధాత్మని కంటే, మానవులకు, బోధకులనబడిన వారికి ప్రాధాన్యత ఇచ్చుచూ నిజదేవుని వ్యర్థముగా ఆరాధించుచూ ఆయన ఆత్మ సంబంధమైన ఆశీర్వాదములను పోగొట్టుకొనుచున్నారు. "యేసుక్రీస్తు భూమిపై జీవించియున్న దినములలో "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా యున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అనెను (మత్తయి 15 : 9). ఈ మనుష్యుల సంఘ సిద్ధాంతములు, పద్ధతులు వలననే, బైబిలు ఒక్కటే అయిననూ, దేవుడు ఒక్కడే అయిననూ, ప్రభువు ఒక్కడే అయిననూ, నేటి దినములలో సంఘ భేదములు, వ్యక్తి భేదములు కనబడుచునే యున్నవి. ఈ దుస్థితి పోవాలంటే అందరూ బైబిలునే ఆధారముగా చేసికొని బైబిలు యొద్దకే రావాలి (Back to the Bible). అయితే బోధించువారు సత్యవాక్యమును సరిగా

విభజించి బోధించవలసిన బాధ్యత యున్నది (2 తిమోతి 2.15). నేటి దినములలో ప్రభువా, ప్రభువా అని పిలుచువారు చాలామంది కలరు గాని పరలోకమందున్న తండ్రి చిత్తప్రకారము చేయువారు కలరా ? (మత్తయి 7:21). "పూర్వకాలమందు నానా విధములుగాను నానా సమయములలోను ప్రవక్తలద్వారా మన పితరులతో మాటలాడిన దేవుడు, ఈ దినముల అంతమందు కుమారునిద్వారా మనతో మాట్లాడెను" (హెబ్రీ 1:1, 2).

అవును, దేవుడు యేసును ఈ లోకమునకు ఆయన వర్తమానముతో పంపెను. యేసు మాట్లాడుచు "ఏలయనగా నా అంతట నేనే మాటలాడలేదు, నేను ఏమనవలెనో యేమి మాట్లాడవలెనో దానిని గూర్చి నన్ను పంపిన తండ్రియే నాకాజ్ఞ యిచ్చి యున్నాడు" యోహాను 12 : 49. దేవుని వర్తమానము యేసు తీసుకు వచ్చి పండ్రెండు మంది అపొస్తులను ఏర్పరచుకొనెను (లూకా 6 : 13, 14). వారికి దేవుని వర్తమానమునిచ్చెను. "లోకము నుండి నీవు నాకు అనుగ్రహించిన మనుష్యులకు నీ నామమును ప్రత్యక్ష పరచితిని. వారు నీవారై యుండిరి, నీవు వారిని నాకనుగ్రహించితివి, వారు నీ వాక్యము గైకొనియున్నారు. నీవు నాకు అనుగ్రహించిన మాటలు నేను వారికిచ్చియున్నాను. వారా మాటలను అంగీకరించిరి" (యోహాను 17 : 6, 7). ఆ అపొస్తలులు లేఖనములు వ్రాయుటకు తండ్రియొక్క వాగ్దానమును అనగా పరిశుద్ధాత్మ బాప్తిస్మమును ఇచ్చెను. యేసు ఆపొస్తలులతో ఇట్లనెను. "సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును, ఆయన తనంతటతానే యేమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులు మీకు తెలియజేయును" (యోహాను 16 : 13). అందుకే పెంతెకోస్తు పండుగ రోజున పరిశుద్ధాత్మ వాగ్దానము ఎవరికి చేయబడినదో వారిమీద కుమ్మరింపబడెను (అ. కార్య

ములు 2 : 1-4). పరిశుద్ధాత్మావేశుడైన పేతురు మాట్లాడినపుడు “వారు ఈ మాటలు విని హృదయములో నొచ్చుకొని - సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును, కడమ అపొస్తులులను అడుగగా పేతురు “మీరు మారుమనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివారు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అపుడు మీరు పరిశుద్ధాత్మ అనువరము పొందుదురు” (అ॥ కార్యములు 2 : 37, 38). ఆ దినమందు 3,000 మంది క్రీస్తు ప్రభువు సంఘముతో చేర్చబడిరి (అ. కార్యములు 2:41). అపొస్తలుడైన పేతురు లేఖనములు ఏలాగు కలిగినవో వ్రాయుచూ, “ఒకడు తన ఊహనుబట్టి చెప్పుట వలన లేఖనములలో ఏ ప్రవచనము పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎపుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవునిమూలముగా పలికిరి” (2 పేతురు 1 : 20,21). అందువలన అందరూ లేఖనములవైపు రావలసినవారై యున్నారు. సంఘము ఎపుడు స్థాపించబడెనో, అది ఏ సంఘమో, సంఘ ఆరాధన ఎలాగుండవలెనో దేవుడు తెలుపనిచో, ఏవిధముగానైనా అనవచ్చు, లేదా చేయవచ్చు లేదా ఆరాధించవచ్చు. కాని దేవుడు అట్లు చేయలేదు. ధర్మశాస్త్ర సంబంధమైన ఆరాధన మార్చివేయబడి యున్నది. ఆ మార్పు యేసుక్రీస్తు సిలువలో జరిగినది (యోహాను 19 : 30; గలతీ 4 : 4-5, 2 కొరింథి 3 : 14-16, హెబ్రీ 8 : 6-7, 13). ఇవేగాక “ఆ లేవీయులు యాజకులై యుండగా ప్రజలకు ధర్మశాస్త్రము ఇయ్యబడెను గనుక ఆ యాజకుల వలన సంపూర్ణ సిద్ధి కలిగిన యెడల అహరోను క్రమములో చేరినవాడని చెప్పబడక మెల్కీసెదెకు క్రమము చొప్పున వేరొక యాజకుడు రావలసిన అవసరమేమి? ఇదియుగాక యాజకులు మార్చబడిన యెడల అవశ్యకముగా యాజక ధర్మము సహా మార్చబడును” (హెబ్రీ 7 : 11, 12). యాజకులు

మార్చబడిరి. క్రైస్తవులే యాజకులని గ్రహించగలము. నేడు అలాగే బోధించుచుండిరి. అది యథార్థమే (1 పేతురు 2:9, ప్రకటన 5:9-10). క్రైస్తవులే యాజకులు మాత్రమే కాదు రాజులైన యాజకులని పాటలుకూడా పాడుచుందుముగాని మార్చబడిన యాజక ధర్మములను గ్రహింపకుండా ధర్మశాస్త్ర సంబంధమైన, ఆచరణలు, విధానములు జరిగించుట ఆజ్ఞాతిక్రమము కాదా! ధర్మశాస్త్రము క్రీస్తునొద్దకు నడిపించుటకు బాలశిక్షకుడు! మరియు విశ్వాసము వెల్లడి ఆయెను గనుక బాలశిక్షకుని క్రింద యుండము (గలతీ 3 : 24-25). ధర్మశాస్త్రము (పాతనిబంధన) ప్రకారము ఆరాధించువారు లేదా నెరవేర్చాలని ప్రయత్నించు వారు "క్రీస్తులోనుండియు, కృపలోనుండియు తొలగిపోయియున్నారు" (గలతీ 5 : 4). అందుకే ధర్మశాస్త్రము నెరవేర్చబడక మునుపు యేసు సమరయ స్త్రీతో మాట్లాడుచూ "అమ్మా, ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమందు ఈ పర్వతము మీదైనను యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు ... ... దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను. తన్ను ఆరాధించువారు అట్టివారే కావలయునని తండ్రి కోరుచున్నాడు" (యోహాను 4:21-24). యేసు "నీ వాక్యమే సత్యమనెను" (యోహాను 17 : 17). మరియు "మీరు సత్యము గ్రహించెదరు, అపుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును అవి చెప్పెను" (యోహాను 8 : 32). క్రైస్తవుడు అను నామము క్రొత్త నిబంధన నామము. క్రైస్తవులగుట దేవుని నిత్యసంకల్పము. దేవుని సంకల్పములో ఏ విధముగా మానవుని విమోచన యున్నదో అపొస్తలుల కార్యముల గ్రంథము చదివిన బోధపడును. అపొస్తలుల కార్యముల గ్రంధములో మార్పు చెందిన సంఘటనలు పది యున్నవి. అని క్రైస్తవులు కాగోరే వారికే దీటయి యున్నవి. అనగా యేసు దేవుని కుమారుడని విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, యేసుక్రీస్తు

దేవుని కుమారుడని ఒప్పుకొని పాప క్షమాపణకొరకైన బాప్తిస్మమును పొందవలెను (మత్తయి 28 : 18-20, మార్కు 16 : 16. అ. కార్యములు 2:38, అ. కార్యములు 22:16). ఆ విధముగా క్రైస్తవులయినవారు ఆ పేరునే కలిగియుండాలి ( 1 పేతురు 4 : 16). ఆ పేరు కలిగిన క్రైస్తవులు ఆది సంఘము ఏ విధముగా ఆరాధించినదో, సువార్త ప్రకటించినదో, ఆచరించినదో అలాగే చేయవలయును (1 కొరింథి 4 : 17). అలాగు చేయరు అని ఎరిగిన పరిశుద్ధాత్ముడు అపొస్తలుడైన పౌలు ద్వారా హెచ్చరించుచూ "వాక్యమును ప్రకటించుము, సమయమందును అసమయమందును ప్రయాసపడుము. సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము. ఎందుకనగా జనులు హితబోధను సహింపక దురదచెవులు గలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసికొని సత్యమునకు చెవి ఇయ్యక కల్పనా కథల వైపునకు తిరుగు కాలము వచ్చును" (2 తిమోతి 4 : 2-4). ఆది సంఘము ఆరాధించిన విధానములో ఆరాధించుచూ, క్రైస్తవ జీవితమును క్రమబద్ధము చేసుకొనుటకై పత్రికలు వ్రాయబడియున్నవి. ఆ విధముగా చేయువారు లోకమును, మతశాఖల సిద్ధాంతములను జయించి పరలోకములోయున్న జీవ వృక్ష ఫలములను భుజించి, నిరంతరము జీవించు వాగ్దానముతోకూడిన నిరీక్షణ పొందగలరు (ప్రకటన 2:7, ప్రకటన 2 : 10).

— యం. సమూయేల్ రాజు

బిక్కవోలు

## స్ఫూర్తి - సూక్తి

మండే దీపం మాట్లాడదు కానీ
కాంతినిస్తూ చీకటిని అంతం చేస్తుంది
కరగిపోతూ వెలుగిస్తుంది క్రొవ్వొత్తి
సత్ క్రైస్తవ్యానికదే చక్కని స్ఫూర్తి!
పాపాల భైరవులు దీపాలై వెలిగే దెప్పుడు!
సిలువ సువార్త విని పశ్చాత్తాపులైనప్పుడు
పాపక్షమాపణకై బాప్తిస్మం పొందినప్పుడు
క్రీస్తు సంఘములో అంగములై యున్నప్పుడు!
ఉల్టా సీదా కబుర్లు చెప్పని "లైట్ హౌస్"
నావికులకు దిశ దెసలు దీపకాంతిని చూపినట్లే;
లోకులకు క్రైస్తవులే క్రీస్తును ప్రకటించాలి
మీరు లోకమునకు వెలుగై యున్నారన్నది క్రీస్తు సూక్తి!

— సామ్యూల్ జాన్, M. కొణితివాడ.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA 533 001

No.

To

..............................
..............................
..............................
..............................